పక్కాగా పొదుపు సంఘాల లెక్క

- నిధులు దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం చర్యలు
- అందుబాటులోకి లోకస్ యాప్ సేవలు
- వీవోఏ, ఏపీఎం, సీసీలకు శిక్షణ

కోడుమూరు : ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యలను చేపడుతోంది. వైఎస్సార్ క్రాంతి పథం (వైకేపీ) సంఘాల్లో మహిళలు పొందే రుణాలు వారు చెల్లిస్తున్న వడ్డీ, సంఘాల కార్యకలాపాలలో పొదుపు వివరాల్లో సంస్థ సమాచారం లోకస్ యాప్‌లో పొందుపరిచి ఆర్థికపరమైన అంశాలను పారదర్శకంగా ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పొదుపు సంఘాల్లో జరుగుతున్న ఆర్థిక అభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన, మహిళలు నిర్వహిస్తున్న వ్యాపార లావాదేవీలు, పొందుతున్న లాభాలు తదితర సమాచారం పక్కగా ఉండేలా లోకస్ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై నెల రోజులుగా వైకేపీ సిబ్బందికి (వీవోఏలు, ఏపీఎం, సీసీలకు) దశలవారీగా శిక్షణ ఇస్తున్నారు. ఈ యాప్‌లో రాష్ట్రవ్యాప్తంగా వున్న పొదుపు సంఘాల వివరాలన్ని నమోదయ్యాయి.

గతంలో వేర్వేరు యాప్‌లలో వివరాలు..

గతంలో పొదుపు సంఘాల వివరాలు వేరువేరు యాప్‌లలో నమోదయ్యేయి. పొదుపు సంఘాల పనితీరు, ఆర్థిక లావాదేవీల నమోదుకు ఒక్కో యాప్‌ను వినియోగించారు. ఇకపై పొదుపు సంఘాలకు సంబంధించి వంద శాతం సమాచారం లోకస్ యాప్‌లోనే నమోదవుతాయి. అంతేగాక పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు ఆధార్‌కార్డుకు అనుసంధానం చేయనున్నారు. రెండు, మూడు సంఘాలో మహిళలు సభ్యులుగా ఉంటే రుణాలు తీసుకునేందుకు అవకాశముండదు.

☛ సి.బెళగల్, గూడూరు మండలాల్లో వెలుగు సీసీ రామన్న అనే వ్యక్తి దాదాపు రూ.20 లక్షలను బీనామి పేర్ల మీద రాసి రుణాలు తీసుకొని స్వాహా చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. అంతేగాక అతను నేరుగా తన పేరుమీదనే దాదాపు రూ.6 లక్షలు రుణాలు తీసుకున్నట్లు బయట పడింది. పొదుపు మహిళలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో సదరు ఉద్యోగిపై విచారణ జరుగుతోంది.

☛ క్రిష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామంలోని టీడీపీ నేతలు పొదుపు సంఘాల మహిళల పేర్ల మీద రూ.6 లక్షలు సీఐఎఫ్ నిధిని రుణాలుగా తీసుకొని ఇప్పటివరకు రూపాయి కూడా చెల్లించలేదు. రికవరీ కోసం వెలుగు సిబ్బంది నానావస్థలు పడుతున్నారు.

☛ పెద్ద కడుబూరు మండలానికి రూ.59 లక్షలు సీఐఎఫ్(కమ్యూనిటీ ఇన్వేస్టింగ్ ఫండ్) నిధి మంజూరుకాగా, వడ్డీతో సహా రూ.90 లక్షలు లెక్కలు చూపాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రూ.15 లక్షలు రికవరీ నిధులున్నాయి. రూ.75 లక్షల లెక్కలు కనిపించడంలేదు. జిల్లాలోని కొన్ని మండలాల్లో సీఐఎఫ్ నిధుల రికవరీ పూర్తిగా నిలిచిపోయాయి. వెలుగు సిబ్బంది మహిళల పేర్లతో అక్రమంగా రుణాలు తీసుకొని స్వాహా చేశారనే విషయం ప్రభుత్వానికి తెలిసింది. ఎమ్మిగనూరు, క్రిష్ణగిరి, డోన్, కోసిగి, పెద్ద కడుబూరు, కౌతళం, ఆస్పరి, తుగ్గలి, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, హలహర్వి మండలాల్లో సీఐఎఫ్ కింద తీసుకున్న రుణాల రికవరీ లేదు. ఫలితంగా ఆ కార్యాలయ సిబ్బంది జీరో బడ్జెట్‌తో అవస్థలు పడుతున్నారు. స్టేషనరీ ఖర్చులకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రుణాల రికవరీకి వెళితే ఆ పేర్లతో వున్న వ్యక్తులు కనిపించడంలేదు. తీసుకున్న రుణాలు మహిళల దగ్గర వసూలు చేసుకొని మండల మహిళ సమాఖ్యకు జమ చేయకుండా వెలుగు సిబ్బందే స్వాహా చేసిన సంఘటలన్ని ప్రస్తుతం వెలుగులోకి వస్తున్నాయి.



లోకస్ యాప్‌పై కర్నూలులో సీసీలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ప్రతి మహిళకు మేలు జరగాలనే ఉద్దేశంతో..

కర్నూలు జిల్లాలో 33,252 పొదుపు సంఘాల్లో 3.24 లక్షల మహిళలు సంఘాల ద్వారా ఆర్థిక లావాదేవీలు నడుపుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలపై అక్రమాలను అరికట్టి అర్హత కలిగిన ప్రతి మహిళకు ప్రభుత్వం ద్వారా నేరుగా మేలు జరగనున్న ఉద్దేశంతో లోకస్ యాప్‌ను అమల్లోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. సంఘాల్లో ఉన్న సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న రుణ వాయిదాలకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. దీన్ని వలన ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ సులభంగా ఉంటుంది. పనిభారం తగ్గి సమయం కలిసివస్తోంది.

ఒకేచోట సమగ్ర సమాచారం



పొదుపు సంఘాల ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం లోకస్ యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా వివరాలను నమోదు చేసేందుకు వైకేపీ సిబ్బందికి ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది. గతంలో వివిధ రకాల యాప్‌లలో పొదుపు వివరాలను నమోదు చేసేవారు. లోకస్ యాప్ రావడంతో పనిభారం తగ్గి సమయం ఆదా అవుతోంది.

– వెంకటస్వామి, వెలుగు ఏపీఎం

క్లుప్తంగా

జేవీకే కిట్ల పరిశీలన



జేవీకే కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం : ప్రభుత్వం అందజేస్తున్న జేవీకే (జగనన్న విద్యా కానుక)కిట్లను ఎంఈఓ కోటయ్య శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 2023–24 విద్యా సంవత్సరానికి సంబధించి ప్రభుత్వం అందిస్తున్న ఈ కిట్లను మండల కేంద్రానికి చేరాయన్నారు. ఇప్పటికే మొదటి దఫా కింద 13,200 పుస్తకాలు, 4,892 యూనిఫాంకు సంబంధించి క్లాత్‌లు వచ్చాయన్నారు. అలాగే మిగిలిన షూ, బెల్ట్, బ్యాగ్, నోట్ పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. వచ్చే నెల మొదటి వారంలో వీటిని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్, ఐఈఆర్‌టీ సాయి తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల కోసం నమోదు చేసుకోండి

పాణ్యం: ఖరీఫ్ పంటలకు ముందు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ విత్తనాల కోసం ఆర్‌బీకేలో నమోదు(రిజిస్ట్రార్) చేసుకోవాలని ఏఓ జయప్రకాష్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న 50శాతం రాయితీ పోను రైతులు రూ. 395 చెల్లించాలన్నారు. ఒక్కో రైతుకు ఐదు ప్యాకెట్ల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డులతో రైతులు ఆర్‌బీకేలో సంప్రదించాలన్నారు.

కోనా వేంకటేశ్వరుడికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న కోనా వేంకటేశ్వర స్వామి

సి.బెళగల్: మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిసి నాలుగు వారాలైన సందర్భంగా, శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు.

గిడ్డాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీగిడ్డాంజనేయస్వామి ఉత్సవ విగ్రహం

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలం వెంకటగిరిలో వెలసిన శ్రీగిడ్డాంజనేయస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం పంచామృతాభిషేకం, ఆకుపూజ, అలంకరణ అర్చన, మంగళహారతి, ప్రభోత్సవ కార్యక్రమాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామి వారికి పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు స్వామి రథోత్సవం

జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీగిడ్డాంజనేయ స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



విగ్రహాలను, శిఖర కలశాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో నూతన శ్రీఅంజనేయస్వామి, గణపతి, నవగ్రహ, గంగమ్మ, నాభిలింగ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వేదపండితులు ప్రాతఃకాల పూజ, దీక్షాహోమము, ధాన్యాధివాసము, పుష్పాధివాసములను నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్ల విగ్రహాలు, శిఖర కలశాలను గ్రామస్తులు మేళతాళాలు, మంగళహారతులతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేర్చారు. ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రతిష్ఠహోమము, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠలు, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమననంతరం శ్రీసీతారాముల వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు భక్త బృందం సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

‘ఉపాధి’లో పాత పద్ధతులను కొనసాగించాలి

పాణ్యం : జాతీయ ఉపాధి హామీ పథకంలో పాత పద్ధతులను కొనసాగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పలు గ్రామాల్లో ఉపా ధి పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతున్న ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసేందుకు సాంకేతిక పరమైన సమస్యలను సృష్టిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 15న ఆయా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఉపాధి కూలీలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణ, మండల కార్యదర్శి భాస్కర్, ప్రతాప్, సుధాకర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు 350 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శనివారం 350 క్యూసెక్కుల నీటి ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉందని డ్యాం అధికారులు తెలిపారు.

పాఠ్య పుస్తకాల మంజూరు

గడివేముల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు శనివారం పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ రామకృష్ణుడు తెలిపారు. మొదట విడతగా 12,634 పాఠ్యపుస్తకాలు, 3,666 స్టీలు గ్లాసులు, 3,743 మందికి యూనిఫాంలు వచ్చాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన మొదటి రోజునే పుస్తకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

అన్ని వర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- సూదిరెడ్డిపల్లెలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

కర్నూలు (న్యూటౌన్): కులం, మతం, వర్గం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు నుదుట బొట్టు పెట్టి, పూలమాలలు వేసి, హారతిచ్చి బంతిపూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి అమ్మా, అక్కా, చెల్లి, అవ్వా, తాతా నమస్కారం అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.

పేదల సంక్షేమానికి కృషి

మెనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.6లక్షల దాకా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని స్పష్టం చేశారు. అందరి మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలిచి, ప్రజలందరూ తమ చల్లని దీవెనలతో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు కృష్ణ, కె మధు, శేఖర్, వెంకటేశ్వర్లు, సురేష్, దస్తగిరి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, మాజీ ఎంపీటీసీ చిన్న లక్ష్మన్న, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, పీఎస్ హేమంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 20వ వార్డులో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 20వ వార్డు 53వ సచివాలయం పరిధిలోని మారుతి మెగాసిటీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజేస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు చెప్పని వాటిని కూడా అందిస్తున్నామన్నారు. టీడీపీ పాలనలో అర్హులైన ఉండినా సంక్షేమ పథకాలు రావాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకులు అండదండలు ఉండేవన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనలో తేడాను గమనించాలన్నారు. కరోనా మహమ్మరితో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్న పేద ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా సీఎం జగనన్న సంక్షేమ పథకాలను కొనసాగించారని గుర్తు చేశారు. నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి వార్డులో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు నిర్మిస్తున్నామన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగలక్ష్మిరెడ్డి, అరుణ, చిట్టెమ్మ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మికాంతరెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, అర్బన్ వార్డుల జేసీఎస్ కన్వీనర్లు గోవర్ధన్ రెడ్డి, హనుమంతురెడ్డి, యూనస్ బాషా, వార్డు నాయకులు భీమశంకర్‌రెడ్డి, రంగారెడ్డి, సంజీవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దొరస్వామి, శివశంకర్‌రెడ్డి, అంబటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదు

కర్నూలు (న్యూటౌన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే సిబ్బందిపై వేటు తప్పదని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం జెడ్పీలోని కర్నూలు మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఉపాధి హామీ పథకంలో 706 పనులు చేపట్టి రూ.5,61,42,184 ఖర్చు చేశామని చెప్పారు. ఇందులో స్పాట్ రికవరీ రూ.5,556, పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.13,250 పెనాల్టీ విధించామని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, డ్వామా అడిషనల్ పీడీ సలీంబాషా, ఏపీడీ లక్ష్మన్న, డీవీఓ సిద్ధాలింగమూర్తి, ఏపీఓ మహమ్మద్‌బాషా, మండల ఇంజినీర్ మనోహర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ చేపట్టిన అధికారులు

ఏపీ సీఎం కప్ విజేతలకు సత్కారం

కర్నూలు (టౌన్): ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతి పట్టణంలోని ఎస్వీ యూనివర్సిటీ క్రీడామైదానంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా వెయిట్ లిఫ్టర్లు ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో రన్నరప్ చాంపియన్‌షిప్ సాధించారు. అలాగే 61 కేజీల విభాగంలో ఎస్.అబ్దుల్లా బంగారు, బి.వీరేష్ కాంస్యం సాధించారు. 49 కేజీల విభాగంలో జి.తులసీ కాంస్యం, 71 కేజీల విభాగంలో ఎం.పుష్పాంజలి కాంస్యం, 87 కేజీల విభాగంలో ఏ.నాగమణి కాంస్యం, 102 కేజీల విభాగంలో పర్వేజ్ ముష్రాఫ్ బంగారు, 67 కేజీల విభాగంలో అబ్దుల్‌హక్ వెండి, 102 కేజీల విభాగంలో గురు చిద్విలాస్ కాంస్యం సాధించారు. వీరితో పాటు కోచ్ యూసుఫ్‌లను న్యాయవాది శ్రీధర్ రెడ్డి ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ సంబరాలు

కల్లూరు: కర్ణాటక రాష్ట్రం శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 138 సీట్లు గెలుచుకున్న సందర్భంగా నంద్యాల పార్లమెంటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ ఆధ్వర్యంలో కల్లూరులోని పార్టీ కార్యాలయం ముందు సంబరాలు చేసుకున్నారు. పార్టీ శ్రేణులతో కలసి దామోదరం సంజీవయ్య భవన్ సమీపంలోని నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లో బాణసంచా పేల్చి కేరింతలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, నాయకులు పఠాన్, నాగలింగం, జనార్దన్, కుమార్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి

కర్నూలు: ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించి పోలీసులు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా సూచించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులకు జిల్లా పోలీసు కార్యాలయంలో హెల్మెట్‌పై శనివారం ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అతివేగం, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలన్నారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు వీఎస్ రమణ, పోతురాజు, శివారెడ్డితో పాటు ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏఆర్ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ

నాడు- నేడు పనుల్లో పురోగతి సాధించాలి

సి.బెళగల్: మండలంలో మనబడి నాడు–నేడు (ఎంబీఎన్ఎన్– 2) రెండో విడత కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. పనుల ఖర్చుల వివరాలను 100 శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలను విద్యార్థులందరికీ పంపిణీ చేసి, విద్యార్థుల హాజరులో వివరాలను నమోదు చేయాలన్నారు.

సాయంత్రం లోగా సర్వే పూర్తి చేయాలి

సి.బెళగల్: ఆదివారం సాయంత్రంలోగా గ్రామ వలంటీర్లు చేపట్టిన బడి బయటి విద్యార్థుల సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ రాముడు శనివారం ఆదేశించారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లు బడి బయటి విద్యార్థుల వివరాలను సమగ్రంగా సేకరించి గ్రామ సచివాలయాలలో సంక్షేమ సహాయకులకు అందజేయాలన్నారు. సర్వేపై నిర్లక్ష్యం చేసే వలంటీర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు హనుమాన్ జయంతి

గూడూరు రూరల్ : మండల పరిధిలోని చనుగొండ్ల, గుడిపాడు, కె.నాగలాపురం, పొన్నకల్, తదితర గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించేందుకు భక్తు బృందాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకు పూజలు, భజనలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించనున్నారు. అనంతరం ఆయా దేవాలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు భక్తులు తెలిపారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

కర్నూలు రూరల్: ప్రతి ఒక్కరూ రోడ్డు, నియమ, నిబంధనలు పాటించాలని పీస్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు దరగయ్య తెలిపారు. నగరంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లతో రోడ్డు భద్రత గురించి ప్రతిజ్ఞ చేయించి వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వాహన రంగంలో 50 ఏళ్ల అనుభవం ఉన్న అబ్దుల్ రషీద్‌ను సన్మానించారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

కోడుమూరు రూరల్: వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులు, మందులను మాత్రమే దుకాణదారులు విక్రయించాలని ఆదోని ఏడీఏ గిరిప్రకాష్ సూచించారు. కోడుమూరులోని కిరణ్ హైబ్రిడ్ సీడ్స్, రాఘవేంద్ర ట్రేడర్, విశ్వజిత్ ట్రేడర్స్, కిసాన్ అగ్రిమాల్‌లో శనివారం కోడుమూరు ఏఓ రవిప్రకాష్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల రికార్డులను, విత్తనాల స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే నిర్ణయించిన ధరలకు విక్రయించాలన్నారు. అనుమతి లేని విత్తనాలను విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే రైతులు కొన్న ప్రతి దానికి కంపెనీ వివరాలతో కూడిన బిల్లులను ఇవ్వాలని సూచించారు.



కోడుమూరులోని విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ గిరిప్రకాష్, ఏఓ రవిప్రకాష్

పాఠశాలలు తెరిచిన రోజే విద్యా కానుక

కోడుమూరు రూరల్ : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమైన జూన్ 12వ తేదీనే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలను అందజేస్తామని ఏపీ సమగ్ర శిక్ష స్టేట్ అబ్జర్వర్ రవీంద్ర బాబు తెలిపారు. శనివారం కోడుమూరులోని బాలుర హైస్కూల్‌ను ఏపీసీ వేణుగోపాల్‌తో కలిసి సందర్శించారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా మండలంలోని విద్యార్థులకు మంజూరైన యూనిఫామ్‌లు, షూల నాణ్యత, కొలతలను పరిశీలించారు. రవీంద్రబాబు మాట్లాడుతూ 2023–24సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,92,955 మంది విద్యార్థులకు సంబంధించిన జగనన్న విద్యాకానుకలు ఆయా స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని 14 మండలాలకు యూనిఫాంలు, 12 మండలాలకు షూలు చేరుకున్నాయని చెప్పారు. నెలాఖరులోగా అన్ని మండలాలకు జగనన్న విద్యాకానుకలు చేరుకుంటాయన్నారు. మండల స్టాక్ పాయింట్ నుంచి జూన్ 11లోగా జగనన్న విద్యాకానుకలు ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ సమగ్ర శిక్ష కర్నూలు ఈఈ రాగప్ప, సీఎంఓ రాజేశ్వరీ, ఏఈ రవి, ఎంఈఓ అనంతయ్య, హెచ్ఎం శ్రీనివాసులు యాదవ్ ఉన్నారు.



బూట్ల సైజును పరిశీలిస్తున్న అధికారులు

నేడు పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని చెన్నమ్మ సర్కిల్‌లోని సీతారామ దేవాలయం వద్ద ఆదివారం రాత్రి ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షులు మనోహర్ బాబు శనివారం తెలిపారు. మయసభ, శ్రీకృష్ణ పడక సీను, సుభద్రార్జున సీను, సత్య హరిశ్చంద్ర వారణాసి, కాటి సీను, డ్యాన్స్ మాస్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ముగిసిన చందన యాత్ర ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథుని మందిరంలో నిర్వహిస్తున్న జగన్నాథుని చందన యాత్ర మహోత్సవాలు –2023 శనివారం ముగిశాయి. గత నెల 23న వైశాఖ శుద్ధ తదియ రోజున ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నైవేద్య సేవలు నిర్వహించారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభుదాస్ భక్తులకు సందేశమిచ్చారు. హరే నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు